# అన్నాదురైకి నేతల నివాళి

● మెరీనాబీచ్‌లో మౌన ర్యాలీలు


అన్నాదురై సమాధివద్ద ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటం ఎదుట నివాళి అర్పిస్తున్న మంత్రులు ఉదయనిధి, కేఎన్ నెహ్రూ, వేలు, ఎంపీలు కనిమొళి, బాలు తదితరులు

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దివంగత అన్నాదురై 55వ వర్ధంతి సందర్భంగా డీఎంకే , అన్నాడీఎంకే నేతలు సహా ఇతర పార్టీల నేతలు శుక్రవారం ఉదయం ఆయన సమాధి ప్రాంతంలో ఘన నివాళి అర్పించారు. మెరీనాబీచ్‌లో మౌన ర్యాలీలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే, అన్నాడీఎంకే నేతలు అన్నాదురై విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రస్తుతం స్పెయిన్ పర్యటనలో ఉన్న సీఎం స్టాలిన్ మాడ్రిడ్ నగరంలో తాను బసచేస్తున్న హోటల్‌లో అన్నాదురై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్టాలిన్‌తోపాటు ఆయన సతీమణి దుర్గాస్టాలిన్, పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా తదితరులు పాల్గొన్నారు.

**దురైమురుగన్ ఆధ్వర్యంలో...**

చెన్నైలో డీఎంకే ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, నీటివనరుల శాఖ మంత్రి దురైమురుగన్ నాయకత్వంలో అన్నా సమాధి వరకు మౌన ర్యాలీ జరిపారు. ఈ ర్యాలీలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఉదయనిధి, శివశంకర్, పీకే శేఖర్‌బాబు, ఎం.సుబ్రమణ్యం, సెంజి మస్తాన్, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, ఐ.పెరియసామి, ఎంపీలు టీఆర్‌బాలు, కనిమొళి, దయానిధి మారన్, డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ ఎస్ భారతి, శాసనసభ్యుడు పల్లావరం ఇ.కరుణానిధి, పార్టీ ప్రధాన కార్యాలయం కార్యదర్శి పూచ్చి మురుగన్, జిల్లా కార్యదర్శులు సిట్రరసు, మయిలై డి. వేలు తదితరులు పాల్గొన్నారు. అన్నాదురై సమాధి వద్ద మరమ్మతులు జరుగుతుండటంతో ఎంజీఆర్, అన్నాదురై సమాధి మధ్య ఖాళీ ప్రదేశంలో అన్నాదురై చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. ఆ చిత్రపటం వద్ద డీఎంకే తరపున మంత్రులు, పార్టీ నేతలు పూలమాలలు సమర్పించి, పుష్పాంజలి ఘటించారు.

**అన్నాడీఎంకే ఆధ్వర్యంలో...**

ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే ఆధ్వర్యంలోనూ మెరీనాబీచ్‌లో అన్నాదురై సమాధి వరకు మౌన ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, పార్టీ సీనియర్ నేతలు శనివారం ఉదయం 10.15 గంటలకు అన్నాదురై సమాధి వద్దనున్న చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. అన్నాడీఎంకే ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుసేన్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కేపీ మునుసామి, నత్తం విశ్వనాథన్, కోశాధికారి దిండుగల్ శ్రీనివాసన్, మాజీ మంత్రులు తంగమణి, జయకుమార్, బెంజమిన్, గోకుల ఇందిరా, ఆర్బీ ఉదయకుమార్, రమణా, మాఫాయ్ పాండ్యరాజన్, జిల్లా కార్యదర్శులు మాధవరం మూర్తి, వీఎస్ రవి, ఆదిరాజారాం, కె.ప్రభాకరన్, టి.నగర్ సత్యా, ఆర్ఎస్ రాజేష్, సాహిత్యవిభాగం డిప్యూటీ కార్యదర్శి డి.శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.


అన్నాదురై చిత్రపటం వద్ద పార్టీ నేతలతో కలిసి పుష్పాంజలి ఘటిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తదితరులు

**ఓపీఎస్ నివాళి...**

ఇదే విధంగా మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) కూడా తన అనుచరులతో మౌన పాదయాత్రగా వెళ్లి అన్నాదురై సమాధి ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటం వద్ద పూలు చల్లి నివాళులర్పించారు. ఆ తర్వాత మాజీ ముఖ్యమంత్రి జయలలిత సమాధి ప్రాంతాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఓపీఎస్‌తోపాటు ఆయన అనుచరులు వైద్యలింగం, వెల్లమండి నటరాజన్, మనోజ్ పాండ్యన్, జేసీడీ ప్రభాకరన్, రెడ్‌సన్ అంబికాపతి, కొళత్తూరు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. చివరగా మాజీ ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు శశికళ తన మద్దతుదారులతో కలిసి అన్నాదురై సమాధి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలతా కోయంబేడులోని పార్టీ కార్యలయంలో అన్నాదురై చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్ తన అనుచరులతో కలిసి రామనాథపురం జిల్లా ముదుగళత్తూరులో అన్నాదురై చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ద్రవిడ కళగం నేత కే వీరమణి తన అనచరులతో కడలూరులోని అన్నాదురై విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిర్పించారు.


స్పెయిన్‌లో అన్నాదురై చిత్రపటం వద్ద నివాళిర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, ఆయన సతీమణి దుర్గా స్టాలిన్, మంత్రి టీఆర్‌బీ రాజా తదితరులు

## అన్నా సమాధి వద్ద శశికళతో ఓపీఎస్ భేటీ


మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వంతో మాట్లాడుతున్న శశికళ

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై వర్ధంతి సందర్భంగా శనివారం ఉదయం మెరీనాబీచ్‌లోని ఆయన సమాధి వద్ద నివాళి అర్పించేందుకు వెళ్లిన మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్), మాజీ ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు శశికళను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పావుగంటకు పైగా ఇరువురూ రాష్ట్ర రాజకీయ పరిస్థితుల గురించి చర్చించుకున్నారు. తొలుత తన మద్దతుదారులతో ఓపీఎస్ అన్నాదురై సమాధిపై పుష్పవలయాలు ఉంచి నివాళి అర్పించి కారులో బయలుదేరారు. ఆ సమయంలో ఎదురుగా మరో కారులో శశికళ వస్తుండగటాన్ని గమనించి ఓపీఎస్ తన కారును నిలిపి కిందకు దిగారు. ఓపీఎస్ కారు నుంచి దిగడాన్ని గమనించిన శశికళ కూడా తన కారును నిలిపి కిందకు దిగారు. ఇరువురూ పరస్పరం నమస్కరించుకున్నారు. అన్నాదురై సమాధివైపు నడుస్తూ రాజకీయ అంశాలపై చర్చించారు. ఆ తర్వాత శశికళ వద్ద సెలవు తీసుకుని ఓపీఎస్ కారులో అక్కడి నుంచి బయలుదేరారు. అటు పిమ్మట శశికళ అన్నాదురై సమాధి వద్ద నివాళి అర్పించారు. ఆ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ... అన్నాడీఎంకేలోని చీలిక వర్గాలన్నీ విలీనం కావాలని తాను ఎప్పటి నుంచో చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని చెప్పారు. ప్రస్తుతం అందరూ ఏకమయ్యే తరుణం ఆసన్నమైందన్నారు. కేంద్రంలో మంత్రిగా పనిచేసిన డీఎంకే ప్రముఖుడొకరు అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ కీర్తి ప్రతిష్ఠలను దిగజార్చే విధంగా విమర్శించడం గర్హనీయమన్నారు. మాజీ సీఎం కరుణానిధి, మాజీ మంత్రి మురసొలి మారన్ సంయుక్తంగా నడిపిన చిత్ర నిర్మాణ సంస్థ నష్టాల్లో కూరుకుపోయినప్పుడు 'ఎంగల్ తంగం' పేరుతో ఆ ఇద్దరు తీసిన సినిమాలో పారితోషికం తీసుకోకుండా నటించి కాపాడిన ఘనత ఎంజీఆర్‌దేనన్నారు. ఎంగల్ తంగం చిత్రవిజయోత్సవంలో మురసొలిమారన్ ఎంజీఆర్ పారితోషికం తీసుకోకుండా నటించడం వల్లే తమ చిత్ర నిర్మాణ సంస్థ నష్టాల నుంచి కోలుకుని లాభాలబాటలో పయనిస్తోందని ప్రకటించిన విషయం అందరికీ తెలుసునని శశికళ అన్నారు. ఓపీఎస్‌తో కలిసి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ... ఓపీఎస్ రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, తమ కుటుంబసభ్యుడన్నారు. తామిద్దరం పార్టీ నుంచి విడిపోయిన వారందరినీ సమైక్య పరిచేందుకు పాటుపడతామని చెప్పారు. డీఎంకేని ఓడించడమే అన్నాడీఎంకేలోని అన్ని వర్గాల ప్రధాన లక్ష్యమని, ఆ ఏకైక లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని వర్గాలు ఏకం కావాల్సిన అవసరం ఉందని శశికళ చెప్పుకొచ్చారు.



ట్రిప్లికేన్ పార్థసారథి స్వామి ఆలయ సహపంక్తి భోజనంలో మంత్రి శేఖర్‌బాబు తదితరులు - సైదాపేట సహపంక్తి భోజనంలో మంత్రి ఎం.సుబ్రమణ్యం

## అన్నాదురై వర్ధంతి
# ఆలయాల్లో సహపంక్తి భోజనం

● పాల్గొన్న మంత్రులు

పెరంబూర్, ఫిబ్రవరి 3: డీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై 55వ వర్ధంతి సందర్భంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో నిర్వహించిన సహపంక్తి భోజనాల్లో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, హిందూ దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. చెన్నైలోని ట్రిప్లికేన్ పార్థసారథి స్వామి ఆలయంలో మంత్రులు ఉదయనిధి, పీకే శేఖర్‌బాబు పాల్గొని ప్రజలతో కలసి భోజనం చేశారు. మైలాపూర్ మాధవ పెరుమాళ్ ఆలయంలో మంత్రి ఐ.పెరియస్వామి, తిరువాన్మియూర్ మరుందీశ్వర ఆలయంలో మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం, బిసెంట్ నగర్ అష్టలక్ష్మి ఆలయంలో మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, చింతాద్రిపేట ఆదిపురీశ్వరర్ ఆలయంలో మంత్రి రఘుపతి, మైలాపూర్ ముండకన్ని అమ్మవారి ఆలయంలో మంత్రి రామచంద్రన్, పాంబన్‌స్వామి ఆలయంలో మంత్రి టీఎం అన్బరసన్, సైదాపేట కారణీశ్వరర్ ఆలయంలో మంత్రి ఎం.సుబ్రమణ్యం, నుంగంబాక్కం అగస్త్రీశ్వర ఆలయంలో మంత్రి ఎస్ఎస్ శివశంకర్, పార్క్ టౌన్ ముత్తుకుమారస్వామి ఆలయంలో జీసీసీ మేయర్ ప్రియ, అడయార్ అనంతపద్మనాభస్వామి ఆలయంలో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి సామినాథన్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కాంచీపురం, చెంగల్పట్టు, వేలూరు సహా అన్ని జిల్లాల్లోని ఆలయాల్లో ఏర్పాటుచేసిన సహపంక్తి భోజనం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.


అడయార్ అనంతపద్మనాభస్వామి ఆలయ సహపంక్తి భోజనంలో మంత్రి సామినాథన్

## జూలై నుంచి రాష్ట్రవ్యాప్తంగా
# రోడ్‌షోలు

● తిరుచ్చిలో మహానాడుకు సన్నాహాలు
● త్వరలో పార్టీకి పతాక రూపకల్పన
● తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ వ్యూహం



చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాలని 'తమిళగ వెట్రి కళగం' అధ్యక్షుడు, ప్రముఖ సినీ నటుడు విజయ్ నిర్ణయించారు. అంతేగాక తిరుచ్చి లేదా కడలూరులో పార్టీ తొలి మహానాడును భారీగా నిర్వహించాలని కూడా నిర్ణయించినట్లు తెలిసింది. తమిళగ వెట్రి కళగం పేరుతో పార్టీ స్థాపిస్తున్నట్లు శుక్రవారం విజయ్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన నటిస్తున్న చిత్రాల షూటింగ్ పూర్తయిన తర్వాత పూర్తిగా రాజకీయ కార్యకలాపాలపైనే దృష్టి సారించనున్నారు. విజయ్ మక్కల్ ఇయక్కమ్ ప్రధాన కార్యదర్శి బుస్సీ నాయకత్వంలో ఆ సంస్థకు చెందిన సీనియర్ నేతలందరికీ పార్టీ సభ్యత్వం కల్పించే పనులు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. అదే సమయంలో పార్టీ ఆశయాలు, నియమ నిబంధనలు, భవిష్యత్తు కార్యాచరణ, పార్టీ పతాకం, చిహ్నం తదితర విషయాలపై మక్కల్ ఇయక్కమ్ సీనియర్ నేతలతో విజయ్ సమగ్రంగా చర్చిస్తున్నారు. పార్టీ విధి విధానాలు, ఆశయాలు ఖరారైన తర్వాత ఆయన రాష్ట్రవ్యాప్తంగా రోడ్‌షోలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు.

**బాహిరంగ సభలు... రోడ్‌షోలు**

కోయంబత్తూరు, తిరుచ్చి, కడలూరు, మదురై తదితర నగరాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని, అదే సమయంలో కుగ్రామాల్లో రోడ్‌షోలు నిర్వహించి స్థానిక ప్రజలతో సాన్నిహిత్యంగా మెలగాలని ఆయన పథకాలు సిద్ధం చేసుకున్నట్లు అనుచరులు చెబుతున్నారు. జూలై లేదా ఆగస్టులో విజయ్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తారని చెప్పారు. రాష్ట్రంలోని 234 నియోజకవర్గాలలోనూ ఆయన పర్యటించం ఖాయమని కూడా చెబుతున్నారు. 2011లో నాగపట్టినంలో తన అభిమాన సంఘాల ఆధ్వర్యంలో భారీ మహానాడును నిర్వహించారు. ఆ మహానాడుకు లక్షలాదిమంది ప్రజలు, జాలర్లు హాజరయ్యారు. ఆ మహానాడు జనాన్ని చూసి రెండు ద్రవిడ పార్టీల నేతలు విస్తుపోయారు. ప్రస్తుతం రాజకీయ ప్రవేశం చేసిన తర్వాత నిర్వహించనున్న పార్టీ మహానాడును కూడా అంతే స్థాయిలో భారీ ఏర్పాట్ల నడుమ జరపాలని నిర్ణయించారు.

**కమల్ శుభాకాంక్షలు...**

విజయ్ రాజకీయ పార్టీని ప్రారంభించడాన్ని స్వాగతిస్తూ మక్కల్ నీది మయ్యం అధినేత కమలహాసన్ శుభాకాంక్షలు తెలిపారు. విజయ్‌కి ఫోన్ చేసి సినీరంగంలో సాధించినట్లే రాజకీయ రంగంలోనూ పలు విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నానని ఆయన తెలిపారు. ఇక డీఎంకే ఎంపీ కనిమొళి స్పందిస్తూ విజయ్ రాజకీయ ప్రవేశం వల్ల 2026లో జరిగే శాసనసభ ఎన్నికల్లో డీఎంకేకు ఎలాంటి నష్టం జరగబోదన్నారు. అదే సమయంలో ప్రజాస్వామ్య దేశంలో రాజకీయాల్లోకి ఎవరైనా రావచ్చునని, ప్రజాభిమానం ఉంటే ఉన్నత స్థితికి చేరుకుంటారని తెలిపారు. పార్టీని ప్రారంభించిన విజయ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

**తమిళిసై కామెంట్...**

నటుడు విజయ్ రాజకీయ పార్టీని ప్రారంభించడం పట్ల పుదుచ్చేరి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హర్షం ప్రకటించారు. రాష్ట్రంలో ఒకే కుటుంబానికి చెందినవారే రాజకీయ నాయకులుగా ఉండటం సరైన పద్ధతి కాదంటూ డీఎంకేపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఏ రంగానికి చెందినవారైన రాజకీయాల్లో రావచ్చునని, విజయ్‌తోపాటు పలువురు రాజకీయ నేతలు రాష్ట్రానికి చాలా అవసరమని ఆమె తెలిపారు.

# రౌడీలపై ఉక్కుపాదం

**714 మంది అరెస్టు ● గత యేడాదితో పోల్చితే తగ్గిన నేరాలు ● 2023 నేర నివేదిక వెల్లడి**

అడయార్, ఫిబ్రవరి 3: గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2023లో జరిగిన నేరాల నివేదికను నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం శనివారం విడదుల చేసింది. 2021, 2022తో పోలిస్తే గత యేడాదిలో నేరాల సంఖ్య తగ్గింది. అదే సమయంలో రౌడీలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఏకంగా 714 మందిని గూండా చట్టం కింద అరెస్టు చేశారు.

**నేరాలు...:** 2021లో 10 కిరాయి హత్యలు జరిగాయి. ఈ సంఖ్య 2022లో 4గాను, 2023లో మూడుగా ఉన్నాయి. దారి దోపిడీ కేసులు 2021లో 357, 2022లో 361, 2023లో 246 జరిగాయి. చోరీ కేసులో వరుసగా 27, 31, 17గా నమోదు కాగా, చైన్ స్నాచింగ్ కేసులు 46, 42, 17 చొప్పున, మొబైల్ చోరీ కేసులు 393, 475, 371 చొప్పున జరిగాయి. 2022-23 మధ్య చైన్, మొబైల్ చోరీ కేసులు తగ్గాయి. 2023లో 2789 మంది నేరస్థులకు కోర్టులు వివిధ రకాలైన శిక్షలను విధించాయి. అలాగే, గత 2021లో 464, 2022లో 496లో గూండా చట్టం కింద అరెస్టు చేయగా, ఈ సంఖ్య 2023లో 714 మందిగా ఉంది.

**భారీగా గంజాయి స్వాధీనం...:** 2023లో మత్తుపదార్థాల స్వాధీనంతో పాటు డ్రగ్స్ కేసులు కూడా అధిక సంఖ్యలో నమోదయ్యాయి. 2021లో 1,460 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోగా, 2022లో 1,107 కిలోలు, 2023లో 2,659 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే, 2023లో ఒక్క గ్రాము కొకైన్ స్వాధీనం చేసుకోలేదు.గత యేడాది 11.4 కిలోల మత్తుపదార్థం, 104.8 కిలోల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.

**రోడ్డు ప్రమాద మృతులు..**

గత యేడాది మొత్తం 499 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 504 మంది చనిపోయారు. 2021లో ఈ ప్రమాదాల సంఖ్య 566 గా, 2022లో 500గా ఉంది. మృతుల సంఖ్య వరుసగా 573, 504గా ఉంది. గత రెండేళ్ళతో పోల్చుకుంటే రోడ్డు ప్రమాదాల్లో 0.2 శాతం, మృతుల్లో 1.79 శాతం తగ్గింది. దీనికికారణం వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంతో పాటు అనేక రకాలైన ట్రాఫిక్ ఆంక్షలను కఠినంగా అమలు చేయడంతో తగ్గిందని పోలీసులు చెబుతున్నారు.

**వరకట్న మరణాలు నిల్...:** గత యేడాది వరకట్న మరణాలు ఒక్కటి కూడా నమోదు కాలేదు. 2022లో ఈ మరణాలు రెండు ఉన్నాయి. అలాగే, 2023లో అత్యాచార కేసులు 21, 2022లో 36 జరిగాయి. భర్త, ఇతర కుటుంబ సభ్యుల వేధింపులు, గొడవల కారణంగా 2023లో 86 కేసులు నమోదు కాగా, 2022లో 106 కేసులు నమోదయ్యాయి. అక్రమ రవాణా, మహిళల కిడ్నాప్ కేసులు గత యేడాది 4 నమోదు కాగా, 2022లో 7గా ఉన్నాయి. అదేవిధంగా పోక్సో చట్టం కింద 2023లో మొత్తం 310 కేసులు నమోదు కాగా, 2022లో 352 కేసులు నమోదయ్యాయి.


దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న పోలీసు కమిషనర్ రాథోడ్

**3,337 సవర్ల బంగారు నగల స్వాధీనం**

గ్రేటర్ చెన్నై సిటీలో గత యేడాది మొత్తం 19.21 కోట్ల 3,337.41 సవర్ల బంగారు నగలు, 50.53 కిలోల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ.3,60,73,051, నగదు, 798 మొబైల్ ఫోన్లు, 411 ద్విచక్రవాహనాలు, 28 ఆటోలు, 15 చిన్నతరహా వాహనాలలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎగ్మోరులోని రాజారత్తినం స్టేడియంలో శనివారం జరిగిన కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ రాథోడ్ పాల్గొని, స్వాధీనం చేసుకున్న వస్తువులను బాధితులకు అందజేశారు. పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతేకాకుండా, 2023లో సెంట్రల్ క్రైం విభాగానికి చెందిన 811 కేసుల్లో రూ.265 కోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.

# సమాచార దర్శిని

## నేడు భ్రమరాంబామల్లికార్జున స్వామి కల్యాణం

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం, కుచలాంబాళ్ చారిటీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 4న ఆదివారం స్థానిక చెట్‌పేట్‌లో వున్న కుచలాంబాళ్ కల్యాణమహల్‌లో భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివార్ల కల్యాణోత్సవం జరగనుంది. సాయంత్రం 6.15 గంటలకు జరుగనున్న ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## చెన్నై నుంచి కోవై, కన్నియాకుమారికి ప్రత్యేక రైళ్లు

ప్యారీస్, ఫిబ్రవరి 3: నగరం నుంచి దక్షిణ జిల్లాలు, కోయంబత్తూర్ మార్గం మీదుగా నడిపే రైళ్లలో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆదివారం ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. నెం.06041 కన్నియాకుమారి నుంచి ఎగ్మూర్‌కు సూపర్‌ఫాస్ట్ ప్రత్యేక రైలు ఆదివారం రాత్రి 8.30గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.45గంటలకు ఎగ్మూర్ చేరుకుంటుంది. నెం.06042 ప్రత్యేక రైలు 5వ తేది మధ్యాహ్నం 1 గంటలకు ఎగ్మూర్‌లో బయల్దేరి తెల్లవారుజాము. 2.45 గంటలకు కన్నియాకుమారి చేరుకుంటుంది. నెం.06043 ప్రత్యేక రైలు కోయంబత్తూర్ నుంచి ఆదివారం రాత్రి 11 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.40 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. అలాగే, నెం.06044 ప్రత్యేక రైలు చెన్నై సెంట్రల్ నుంచి 5వ తేది ఉదయం 10.20 గంటలకు బయల్దేరి రాత్రి 8.25 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుంది.

## తిరుచ్చి - అహ్మదాబాద్ ప్రత్యేక రైళ్ల పొడిగింపు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 3: తిరుచ్చి - అహ్మదాబాద్ ప్రత్యేక రైళ్ల సేవలను ఈ నెలాఖరు వరకు పొడిగించినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. అహమ్మదాబాద్ - తిరుచ్చికి ప్రతి గురువారం నడిచే వారాంతపు ప్రత్యేక రైలు ఈనెల 29వ తేది వరకు, తిరుచ్చి - అహమ్మదాబాద్ మధ్య ఆదివారాల్లో నడిచే ప్రత్యేక రైలు మార్చి 3వ తేది వరకు పొడిగించారు. ఓఖా నుంచి ఈ నెల 5, 12, 19, 26 తేదీల్లో రాత్రి 10 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు మరుసటి నాల్గో రోజున ఉదయం 11.45 గంటలకు మదురై చేరుకుంటుంది. మదురై నుంచి ఈ నెల 9, 16, 23, మార్చి 1వ తేదీల్లో అర్ధరాత్రి 1.15 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు మూడో రోజున ఉదయం 10.20 గంటలకు ఓఖా చేరుకుంటుంది. ఈ రైళ్ల రిజర్వేషన్ శుక్రవారం ప్రారంభమైంది.

## రైలు సేవల్లో మార్పులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 3: స్థానిక కొరుక్కుపేట - బేసిన్ బ్రిడ్జి మధ్య ఈనెల 5 నుంచి 10వ తేది వరకు రాత్రి 11 నుంచి వేకువజామున 3 గంటల వరకు రైలు మార్గం అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా సూళ్లూరుపేట - సెంట్రల్ మధ్య రాత్రి 9.40 గంటల రైలు పైన పేర్కొన్న రోజుల్లో బేసిన్‌బ్రిడ్జి మీదుగా సెంట్రల్ వెళ్లకుండా బీచ్ రైల్వేస్టేషన్‌కు వెళ్లనుంది. సెంట్రల్ - ఆవడి మధ్య రాత్రి 11.45గంటల రైలు చెన్నై బీచ్ నుంచి బయల్దేరుతుందని చెన్నై రైల్వే డివిజన్ తెలిపింది.

## సెమ్మొళి పార్కులో వేసవి ప్రత్యేక ప్రదర్శన

ఐసిఎఫ్, ఫిబ్రవరి 3: స్థానిక సెమ్మొళి పార్కులో వేసవి కాల ప్రత్యేక ప్రదర్శన నిర్వహించేందుకు ఉద్యానవన శాఖ సన్నాహాలు చేపట్టింది. ఊటీ, కొడైకెనాల్, ఏర్కాడు ప్రాంతాల్లో పుష్ప ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లే, చెన్నైలో రెండేళ్లుగా ఈ ప్రదర్శనను ఉద్యానవన శాఖ నిర్వహిస్తోంది. మొదటి ప్రదర్శన చేపాక్కం కలైవానర్ అరంగం, రెండో ప్రదర్శన తేనాంపేట సెమ్మొళి పార్కులో జరిగింది. మూడో వేసవి పుష్ప ప్రదర్శన ఈ నెల 9, 10 తేదీల్లో సెమ్మొళి పార్కులోనే జరగనుంది. ఇందుకోసం వివిధ జిల్లాల్లో ఉన్న ఉద్యానవన ఫారాల నుంచి పూల మొక్కలు చెన్నైకి చేరుకున్నాయి. ఈ ప్రదర్శనలో విత్తనాలు, నారు, మొక్కలు, సహజ ఎరువులు వంటివి విక్రయించనున్నట్లు అధికారులు తెలిపారు.

## రేపటినుంచి కొత్త పార్కింగ్ అందుబాటులోకి

ఐసిఎఫ్, ఫిబ్రవరి 3: స్థానిక ఎగ్మూర్ రైల్వేస్టేషన్ బుకింగ్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన కొత్త వాహన పార్కింగ్ సోమవారం అందుబాటులోకి రానుంది. ఈ స్టేషన్‌లో పునరుద్ధరణ పనులు జరగనుండడంతో, ఎగ్మూర్ మెట్రో రైల్వేస్టేషన్ వాహన పార్కింగ్‌ను దక్షిణ రైల్వే టిక్కెట్లు బుకింగ్ కార్యాలయ సమీపంలోకి మార్చారు. ఈ కొత్త పార్కింగ్ వసతిని ప్రజలు ఈనెల 5వ తేది నుంచి వినియోగించుకోవచ్చని సీఎండీఏ తెలియజేసింది.

## మున్సిపాలిటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో 1,933 ఖాళీ పోస్టులు నేరుగా భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు ఈ నెల 9 నుంచి మార్చి 12వ తేది వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్), సర్వేయర్, టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ ఇంజనీర్, సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వంటి పోస్టులకు అర్హులైనవారు http://tnmaws.ucanapply.com అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పోస్టులకు రాతపరీక్ష జూన్ 29, 30 తేదీల్లో నిర్వహించనున్నారు.

## 12 వేల పంచాయతీలకు క్రీడా ఉపకరణాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 3: రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడ శాఖల ఆధ్వర్యంలో 12 వేల పంచాయతీలకు క్రీడా ఉపకరణాలు అందజేయనున్నారు. కరుణానిధి శతజయంతి వేడుకల్లో భాగంగా ఈనెల 7వ తేది తిరుచ్చిలో జరుగనున్న కార్యక్రమంలో మంత్రి ఉదయనిధి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. కశ్మీర్ విల్లో క్రికెట్ బ్యాట్, బ్యాటింగ్ కాటన్ గ్లోవ్స్, ఫోం లెథర్, లెథర్ వికెట్ కీపింగ్ గ్లోవ్స్, లెగ్ గార్డ్, స్టంప్స్, అబ్‌డామినల్ గార్డ్, హెల్మెట్‌తో కూడిన కిట్‌ను అందజేయనున్నారు. అలాగే, వాలీబాల్, ఫుట్‌బాల్, త్రోబాల్, స్కిప్పింగ్, డంబెల్స్, క్యారమ్, చెస్, బాడ్మింటన్ వంటి 32 క్రీడలకు సంబంధించిన ఉపకరణాలు ఈ ప్యాకేజీ ద్వారా అందజేస్తారు.

## నెలంతా ఆవిన్ డే ఉత్సవాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 3: ఆవిన్ డే ఉత్సవాలు ఈనెల మొత్తం జరుపుకోనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర పాల ఉత్పత్తిదారుల సహకార శాఖ అయిన ఆవిన్, 1981 ఫిబ్రవరి 1న ఏర్పడింది. దీన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 1వ తేది ఆవిన్ డే ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈనెల పొడవునా ప్రజలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నారు. ఆవిన్‌పై అవగాహన కల్పించేందుకు, ప్రజల అవసరాలు గుర్తించి విక్రయాలు పెంచేందుకు ఆవిన్ నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు ఆవిన్ మేనేజింగ్ డైరెక్టర్ వినీత్ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఈ ఏడాది 32 మంది అవయవదానం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 3: ఈ సంవత్సరం ఇప్పటివరకు 32 మంది అవయవదానాలు చేసినట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. గత ఏడాది 178మంది నుంచి అవయవాలు దానంగా పొంది 1,000 మందికి అమర్చినట్లు తెలిపారు. అవయవాల కోసం వేచి ఉన్న వారి సంఖ్య పెరిగిందని ఆరోగ్యశాఖ తెలిపింది.

# సిటీయూనియన్ బ్యాంక్ నికర లాభం రూ.253 కోట్లు

**ఎండీ కామకోడి ప్రకటన**



చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గత డిసెంబరు 31తో ముగిసిన త్రైమాసికంలో సిటీ యూనియన్ బ్యాంక్ (సీయూబీ) నికర లాభం 16 శాతం అధికమై రూ.253 కోట్లకు చేరిందని ఆ బ్యాంకు ఎండీ డాక్టర్ కామకోడి తెలిపారు. ఆ మేరకు శనివారం బ్యాంక్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ఆయన వెల్లడించారు. గత యేడాది ఇదే త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం రూ.219 కోట్లుగా నమోదైనట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం త్రైమాసిక ఫలితాలతో పోల్చుకుంటే బ్యాంక్ నిర్వహణ లాభం రూ.497 కోట్ల నుంచి రూ.364 కోట్లకు తగ్గిందని, అంటే 27 శాతం నిర్వహణ లాభం తగ్గుముఖం పట్టిందని వివరించారు. వడ్డీ ఆదాయం రూ.1,206 కోట్ల నుంచి 10 శాతం వృద్ధితో రూ.1,326 కోట్లకు పెరిగిందని, వడ్డీయేతర ఆదాయం గత యేడాది నమోదైన రూ.224 కోట్ల నుంచి రూ.193 కోట్లకు తగ్గిందని తెలిపారు. ఇదే రీతిలో నికర వడ్డీ ఆదాయం 7 శాతం క్షీణించి రూ.556 కోట్ల నుంచి రూ.516 కోట్లకు తగ్గుముఖం పట్టిందన్నారు. స్థూల ఎన్పీయే డిసెంబర్ 2023 త్రైమాసికం నాటికి 4.47 శాతానికి తగ్గిందని, మునుపటి యేడు త్రైమాసికంలో 4.62 శాతం, అంతకు ముందు త్రైమాసికంలో 4.66 శాతంగా ఉండేదని తెలిపారు. నికర ఎన్పీయే కూడా గత యేడాది త్రైమాసికంలో 2.67 శాతం నుంచి 2.19 శాతానికి, ఈ ఆర్థిక సంవత్సరం త్రైమాసికం నుంచి 2.34 శాతానికి తగ్గుముఖం పట్టిందన్నారు. బ్యాంక్ డిపాజిట్లు 5 శాతం పెరిగి రూ.49,997 కోట్ల నుంచి రూ.52726 కోట్లకు చేరిందని తెలిపారు. బ్యాంకు రుణాలు 2 శాతం వృద్ధితో రూ.43,009కోట్ల నుంచి రూ.44,017 కోట్లకు పెరిగిందన్నారు. గత డిసెంబర్ 31తో ముగిసిన 9 నెలల కాలానికి బ్యాంక్ నికర లాభాన్ని రూ.761 కోట్లుగా నివేదించినట్లు తెలిపారు. మునుపటి ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇది 8 శాతం పెరిగిందన్నారు.

# ఘనంగా ప్రతిభా పురస్కారాల ప్రదానం



ప్రతిభా పురస్కారగ్రహీతలతో సరళ బాలాజి, షర్మిల, లక్ష్మీదేవిలు

ప్యారీస్, ఫిబ్రవరి 3: స్థానిక జార్జిటౌన్‌లోని కేటీసీటీ పూర్వ విద్యార్థినుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ సంఘం 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అధ్యక్షురాలు జి.సరళ బాలాజి నేతృత్వంలో ఎస్‌కేపీడీ కన్వెన్షన్ హాలులో శనివారం ఉదయం 10 గంటలకు ప్రార్థన, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థినుల్లో ప్రతిభా పాటవాలు మెరుగుపరిచేలా మామిడి ఆకుల తోరణం, ఎంబ్రాయిడరీ డిజైన్, చేంజ్ ఫర్ చేంజ్ తదితర పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు సభ్యులు, విద్యార్థినులు, కళాకారుల సంప్రదాయ నృత్యాలు, లక్కీ డ్రా, తంబోలా, వివిధ క్రీడా పోటీలు ఆద్యంతం సందడిగా సాగాయి. ముందుగా సంఘం అధ్యక్షురాలు సరళ బాలాజి మాట్లాడుతూ... తమ అసోసియేషన్ తరఫున కేటీసీటీ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు సహాయ సహకారాలు అందజేస్తూ, వారిని ఉన్నతవంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా పలు రంగాల్లో రాణిస్తున్న మహిళామణులకు ప్రతిభా అవార్డులను బహూకరించి గౌరవిస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శి ఇమ్మిడి షర్మిల, ట్రెజరర్ బి.లక్ష్మీదేవి, సభ్యులు పాల్గొన్న ఈ వేడుకల్లో ఐకాస్ టెక్నాలజీస్ డైరెక్టర్ సి.శోభరాజ ముఖ్యఅతిథిగా పాల్గొని సంస్థ కొనసాగిస్తున్న సేవలను కొనియాడారు.

# ఎవరికి విశ్వాసంగా ఉంటున్నారు?

**హిందూ దేవాదాయ శాఖ అధికారులను ప్రశ్నించిన న్యాయస్థానం**

ప్యారీస్, ఫిబ్రవరి 3: కన్నియాకుమారిలోని భగవతి అమ్మవారి ఆలయానికి పూంపుహార్ నౌకాయాన సంస్థ రూ.2.32 కోట్లు అద్దె చెల్లించని వ్యవహారంలో, ఎవరికి విశ్వాసంగా ఉంటున్నారంటూ హిందూ దేవాదాయ శాఖ అధికారులను మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ ప్రశ్నించింది. కన్నియాకుమారి ఆలయ సేవకుల సభ అధ్యక్షుడు రాధాకృష్ణన్ హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలు చేసిన పిటిషన్‌లో... కన్నియాకుమారి భగవతి అమ్మవారి ఆలయానికి చెందిన స్థలంలో 12,431 చదరపు అడుగుల ఖాళీ స్థలాన్ని పూంపుహార్ నౌకాయాన సంస్థకు 1984లో అద్దెకిచ్చారని, 2018 జనవరి 1వ తేది వరకు ఆ నౌకా సంస్థ రూ.2.32 కోట్ల అద్దె బాకీని ఆలయ యాజమాన్యానికి చెల్లించలేదని,బాకీసహా వడ్డీతో కలిపి వసూలు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసును 2022లో విచారణకు స్వీకరించిన హైకోర్టు మదురై బెంచ్.. హిందూ దేవాదాయ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు పూంపుహార్ సంస్థ నుంచి అద్దె బాకీ వెంటనే వసూలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయితే దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో, పిటిషనర్ మళ్లీ కోర్టును ఆశ్రయించి సంబంధిత అధికారులపై చర్యలను తీసుకోవాలని కోరుతూ కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కేసు వేశారు. శనివారం ఉదయం ఈ కేసు మళ్లీ విచారణకు రాగా, హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తి పుహళేంది సమక్షంలో ఇరుతరపు న్యాయవాదులు హాజరై విచారించారు. అప్పుడు... ఆలయానికి సంబంధించిన అద్దె బాకీ వసూలు చేయకుండా ఇన్నాళ్లు ఎవరికి విశ్వాసులుగా ఉంటున్నారని దేవాదాయ శాఖ అధికారులను ప్రశ్నించారు. అధికారుల పనితీరు తృప్తికరంగా లేదని న్యాయమూర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కేసు తదుపరి విచారణను తేది ప్రకటించకుండా వాయిదా వేశారు.

# కోయంబేడు నుంచే ఆమ్నీ బస్సులు అనుమతించాలి

- యజమానుల సంఘం విజ్ఞప్తి


ఆమ్నీ బస్సుల యజమానులతో చర్చిస్తున్న సీఎండీఏ మెంబర్ సెక్రటరీ అన్సూల్ మిశ్రా తదితరులు

ప్యారీస్, ఫిబ్రవరి 3: దక్షిణ జిల్లాల ప్రజల సౌకర్యార్థం కోయంబేడు నుంచే ఆమ్నీ బస్సుల సేవలు కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని ఆమ్నీ బస్సుల యజమానుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. నగర శివారు ప్రాంతమైన కిలంబాక్కంలో నూతనంగా నిర్మించిన బస్ టెర్మినల్ నుంచే ఆమ్నీ బస్సులు నడపాలంటూ గతనెల 24న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శివశంకర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందుకు అభ్యంతరం తెలిపిన ఆమ్నీ బస్సుల యజమానులు కిలంబాక్కంలో బస్సుల పార్కింగ్‌కు, అలాగే డ్రైవర్, కండక్టర్లు విశ్రాంతి తీసుకొనేందుకు వసతులు కల్పించలేదని, అంతేకాకుండా చెన్నైకి దూరంగా ఉండడం వల్ల కిలంబాక్కంకు చేరుకొనేందుకు ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారని పేర్కొన్నారు. మునుపటి లాగే కోయంబేడు నుంచే ఆమ్నీ బస్సు సర్వీసులు కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని బస్సుల యజమానులు మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు... సమస్యను సున్నితంగా పరిష్కరింపజేసేలా ఆమ్నీ బస్సుల సంఘ నిర్వాహకులతో సీఎండీఏ అధికారులు సమావేశమై చర్చించాలని సూచించింది. ఆ మేరకు ఎగ్మూర్‌లో ఉన్న సీఎండీఏ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఏఎస్ అధికారులు అన్సూల్ మిశ్రా, షణ్ముగసుందరం, ఆమ్నీ బస్సుల సంఘ రాష్ట్ర నిర్వాహకులు అన్బళగన్ తదితరులు పాల్గొని చర్చించారు. అప్పుడు కోయంబేడు నుంచే తమ సేవలు అనుమతించాల్సిందిగా ఆమ్నీ బస్సుల యజమానులు ప్రభుత్వాన్ని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

## నవజాత శిశువులకు వినికిడి పరీక్షలు తప్పనిసరి

- డాక్టర్ ప్రసన్నకుమార్


'విల్లుపాట్టు' సంగీత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వినికిడి పరికరాలు అమర్చుకున్న చిన్నారులు

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువులకు ముందస్తు పరీక్షలు జరుపుకుంటే వినికిడి లోపాలను నివారించవచ్చని స్థానిక పోరూరు శ్రీరామచంద్ర ఉన్నత విద్యా పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన కోక్లియర్ ఇంప్లాంట్ కార్యక్రమంలో ఈఎన్‌టీ విభాగ అధిపతి ప్రసన్నకుమార్ తెలిపారు. కోక్లియర్ ఇంప్లాంట్ వంటి వినికిడి సాధనాలు ప్రస్తుతం చిన్నారులలో వినికిడి సమస్యలను పరిష్కరిస్తున్నాయని చెప్పారు. తమ ఆసుపత్రుల్లో జన్మించే శిశువులకు ముందస్తు వినికిడి పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. గత ఐదేళ్లలో తొమ్మిది శిశువులకు వినికిడి లోపాలు ఉన్నట్లు గుర్తించి కోక్లియర్ పరికరాలను అమర్చే శస్త్రచికిత్సలు చేసినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వినికిడి పరికరాలు అమర్చుకున్న బాలబాలికలు సంగీత, నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. రిజిస్ట్రార్ రూపా నాగరజాన్, మెడికల్ సూపరింటెండెంట్ పి.సురేంద్రన్, ప్రిన్సిపాల్ ప్రకాష్ భూమినాథన్, ఆడియాలజీ విభాగాధిపతి జయశ్రీ సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

## మసీదు ప్రారంభానికి హిందువులు, క్రైస్తవుల సారె

అడయార్, ఫిబ్రవరి 3: తిరువారూరు జిల్లా తిరుత్తురైపూండి సమీపంలోని కొత్తమంగళం పంచాయతీ కడియచ్చేరిలో కొత్తగా మసీదును నిర్మించగా, దీని ప్రారంభోత్సవం శుక్రవారం జరిగింది. దీన్ని పురస్కరించుకుని గ్రామంలోని హిందువులు, క్రైస్తవులు కలిసి సారె అందించారు. ఈ మసీదు ప్రారంభోత్సవంలో మూడు మతాలకు చెందిన ప్రజలు పాల్గొని మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. కాగా, ఈ గ్రామంలో 3 వేలకు పైగా కుటుంబాలు ఉండగా, ఇందులో 250 ముస్లిం కుటుంబాలున్నాయి.

## రామేశ్వరంలో 4.36 కిలోల బంగారం స్వాధీనం

- ఒకరి అరెస్టు

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సమీపంలోని కుందుకాల్ తీరం వద్ద శ్రీలంక నుంచి తరలించిన 4.36 కిలోల బంగారు బిస్కెట్లను కస్టమ్స్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. శ్రీలంక నుంచి అక్రమంగా బంగారాన్ని తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు కస్టమ్స్ అధికారులు ఆ తీరం వద్ద నిఘా వేశారు. శ్రీలంక నుంచి నాటుపడవలో వచ్చిన వ్యక్తి నుంచి బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తి వద్ద విచారణ జరుపుతున్నారు.

## మేఘాలయ హైకోర్టు సీజేగా వైద్యనాథన్

ప్యారీస్, ఫిబ్రవరి 3: మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి ఎస్.వైద్యనాథన్ మేఘాలయ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ తన 'ఎక్స్'లో దేశంలోని పలు రాష్ట్రాల హైకోర్టులకు నియమితులైన ప్రధాన న్యాయమూర్తులు, బదిలీ అయ్యే న్యాయమూర్తుల వివరాలను వెల్లడించారు. వీరి పేర్లను గత ఏడాది నవంబరు 2వ తేది సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదించింది. వీరిలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్న ఎస్.వైద్యనాథన్ త్వరలోనే మేఘాలయ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ప్రమాణస్వీకారం చేస్తారని కోర్టు వర్గాలు తెలిపాయి.

## 100 మంది చిన్నారులపై లైంగిక వేధింపులు

**నిందితుడు యోవాన్ వాంగ్మూలం**

ప్యారీస్, ఫిబ్రవరి 3: ఎనిమిదేళ్ల చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడి పోలీసులకు పట్టుబడిన యోవాన్ దాదాపు 100 మంది చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. తిరువాన్మి యూర్‌కు చెందిన యోవాన్(29)... తనకు తల్లి లేదని, తండ్రి మరో మహిళను వివాహం చేసుకోవడంతో తాను అనాథనయ్యానని, కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని పేర్కొన్నాడు. సెల్‌ఫోన్‌లో అసభ్య చిత్రా లకు బానిసయ్యానని, ఆ తర్వాతే చిన్నారులపై ఈ అఘాయిత్యానికి పాల్ప డినట్లు నేరాన్ని అంగీకరించాడు. విచారణ అనంతరం పోలీసులు అతనిని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

## రెండు బస్సుల ఢీ

- 10మందికి గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన రెండు రాష్ట్రాలకు చెందిన రవాణా సంస్థ బస్సులు

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా మార్తాండం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు సహా పదిమంది గాయపడ్డారు. శుక్రవారం ఉదయం కన్నియకావిళై నుంచి నాగర్‌కోవిల్‌కు రాష్ట్ర రవాణా సంస్థ బస్సు వెళ్తుండగా, నాగర్‌కోవిల్ నుంచి తిరువనంతపురానికి వెళ్తున్న కేరళ రాష్ట్ర రవాణా సంస్థ బస్సు మార్తాండం ఫ్లైఓవర్ వద్ద ఢీకొంది. ఈ దుర్ఘటనలో రెండు బస్సుల డ్రైవర్లు సహా 10 మంది గాయపడ్డారు. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా గంటసేపు ఆ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## 11న చెన్నైకి జేపీ నడ్డా రాక



ప్యారీస్, ఫిబ్రవరి 3: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈనెల 11న చెన్నైకి రానున్నారు. రాష్ట్రంలో బీజేపీ తరఫున పార్లమెంటు ఎన్నికల పనులను ముమ్మరం చేసేందుకు పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. ఇందుకోసం ఆ పార్టీలోని జాతీయ స్థాయి నేతలకు పలు రాష్ట్రాల ఎన్నికల బాధ్యతలు కట్టబెట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర బీజేపీ ప్రధాన నిర్వాహకులు, సీనియర్ నేతలతో నడ్డా సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఎన్నికల ముందస్తు పనులు, ప్రచారంలో లేవనెత్తాల్సిన అంశాలు తదితరాలపై ఆయన సలహాలివ్వనున్నట్లు తెలిసింది. 11న జేపీ నడ్డా పాల్గొననున్న సమావేశానికి ఎంపిక చేసిన వేదిక, సమయం తదితర వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నామలై బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఎన్డీఏ కూటమిలో పార్టీల మధ్య విభేదాలు నెలకొన్న విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్త పర్యటనలో పాల్గొంటున్న అన్నామలై చేసిన విమర్శల కారణంగా కూటమి నుంచి వైదొలుగుతున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పార్టీ సర్వసభ్య సమావేశం వేదికగా ప్రకటించడంతో పాటు భవిష్యత్తులో ఆ పార్టీతో చేతులు కలపబోమని స్పష్టం చేశారు. ఇందువల్ల అన్నాడీఎంకేతో మళ్లీ సఖ్యత కుదుర్చుకొనేందుకు బీజేపీ పెద్దలు ఒక వైపు మంతనాలు జరుపుతున్న నేపథ్యంలో, నడ్డా రాక ప్రాధాన్యం సంతరించుకుంది.

## మేనిఫెస్టో తయారీకి సలహాలివ్వండి

- ప్రజానీకానికి స్టాలిన్ పిలుపు



చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల డీఎంకే మేనిఫెస్టో తయారీకి ప్రజలు తమ సలహాలు, సూచనలను తెలియజేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికలు దేశ రాజకీయ భవిష్యత్తుకు సంబంధించినవని, మతతత్వాన్ని, కులచిచ్చును రెచ్చగొట్టే దుష్టశక్తులను తరిమికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో డీఎంకే ఎన్నికల మేనిఫెస్టో కీలక పాత్ర పోషించనుందని, ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రజలు తమ అభిప్రాయలను తెలియజేయాలన్నారు. ప్రజలు పోస్టుద్వారా తమ అభిప్రాయాలను 'ఎన్నికల మేనిఫెస్టో తయారీ కమిటీ, అన్నా అరివాలయం, నెం.367/369, అన్నాసాలై, తేనాంపేట. చెన్నై 600018' అనే చిరునామాకు పంపాలని తెలిపారు. ఇదే విధంగా dmkmanifesto2024@dmk.in అనే వెబ్‌సైట్‌కు ఈ మెయిల్ ద్వారా తెలియజేయవచ్చన్నారు.

## ఎనిమిది ప్రాచీన విగ్రహాల స్వాధీనం

- శిల్పశాల యజమాని అరెస్టు



చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలోని ప్రముఖ శిల్పశాలలో దాచి ఉంచిన కోట్లాది రూపాయల విలువైన ఎనిమిది ప్రాచీన విగ్రహాలను రాష్ట్ర విగ్రహాల అక్రమరవాణా నిరోధక విభాగ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి శిల్పశాల యజమాని లక్ష్మీనరసింహన్‌ను అరెస్టు చేశారు. లక్ష్మీనరసింహన్ విగ్రహాల స్మగ్లర్ దీనదయాళన్ అనుచరుడని పోలీసుల విచారణలో తేలింది.

## కర్పూరం తిన్న మానసిక రోగి మృతి

ఐసిఎఫ్, ఫిబ్రవరి 3: ఎక్కువ మోతాదులో కర్పూరం తిన్న మానసిక రోగి మృతి చెందాడు. తిరువణ్ణామలై జిల్లా సెయ్యారు సమీపంలోని ఏనాదవాడి గ్రామానికి చెందిన మానసిక రోగి పెరుమాళ్(60) జనవరి 8వ తేది రాత్రి ఇంట్లో ఉన్న హారతి కర్పూర బిళ్లలను తిని స్పృహ కోల్పోయాడు. వెంటనే కుటుంబసభ్యులు ఆయన్ను వేలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స ఫలించక పెరుమాళ్ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. మోరణం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వేదారణ్యం జాలర్లపై శ్రీలంక సముద్ర దొంగల దాడి


దాడికి గురైన వేదారణ్యం జాలర్లు

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం సమీపం కోడియక్కరైకి ఏడు నాటికల్ మైళ్ల దూరంలో సముద్రంలో చేపలుపడుతున్న వేదారణ్యం ప్రాంతానికి చెందిన ఐదుగురు జాలర్లపై శ్రీలంక సముద్రపు దొంగలు మారణాయుధాలతో దాడి జరిపి, పడవల్లోని చేపలు, జీపీఎస్ పరికరాలు, ఇతర వస్తువులు దోచుకెళ్లారు. నాగపట్టినం జిల్లా వేదారణ్యం సమీపం ఆరుక్కాటుతురై నుంచి రామన్, రమేష్, శివకుమార్ అనే జాలర్లు ఓ ఫైబర్ పడవల్లో, పొన్నుదురై, జయచంద్రన్ అనే జాలర్లు మరో ఫైబర్ పడవలో శుక్రవారం ఉదయం సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. శనివారం వేకువజాము కోడియక్కరై నుంచి ఏడు నాటికల్ మైళ్ల దూరంలో ఆ ఐదుగురు జాలర్లు చేపలుపడుతుండగా పడవలో మారణాయుధాలతో వచ్చిన శ్రీలంక సముద్ర దొంగలు వారిపై దాడి చేశారు. వేటకొడవళ్లు, కత్తులతో దాడి జరిపి రూ.50 వేల విలువైన చేపలు, జీపీఎస్ పరికరాలు, సెల్‌ఫోన్లు దోచుకుని మెరుపువేగంతో మాయమయ్యారు. ఈ సంఘటనలో ఐదుగురు జాలర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఆ తర్వాత తీరానికి చేరుకుని చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. ఈ సంఘటనపై సముద్రతీర భద్రతా దళం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

## ఇద్దరు పిల్లల తల్లిని హత్య చేసిన ప్రియుడు

- నామక్కల్ జిల్లాలో దారుణం

అడయార్, ఫిబ్రవరి 3: ఇద్దరు బిడ్డల మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఒక యువకుడు ఆమెను చంపేసి... కాల్చేశాడు. ఈ దారుణ ఘటన నామక్కల్ జిల్లా కొల్లిమలైలో వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. కొల్లిమలైకు చెందిన వల్లరసు (28) సేలం జిల్లా వాళప్పాడి సమీపంలో ఒకటిన్నర ఎకరం పొలం కొనుగోలు చేసి, సాగుచేస్తూ, అక్కడే ఉంటున్నారు. అతనితో కలిసి ఒక మహిళ, ఇద్దరు పిల్లలు ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం వారిమధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన వల్లరసు మహిళను చంపేసి, పొలంలోనే మృతదేహాన్ని కాల్చివేశాడు. ఆ సమయంలో అటుగా వెళ్లిన కొందరు స్థానికులు పొలంలో పొగలు రావడాన్ని గమనించి, దగ్గరకు వెళ్లి చూడగా, మహిళ మృతదేహం సగం కాలిన స్థితిలో ఉంది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించగా, వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవపరీక్షకు తరలించారు. ఆ తర్వాత పోలీసులు జరిపిన ప్రాథమిక విచారణలో.. మృతురాలిని సుగుణ (32)గా గుర్తించారు. కుటుంబ కలహాల కారణంగా భర్తకు దూరంగా తన ఇద్దరు పిల్లలతో జీవిస్తూ వచ్చిన ఆమెకు వల్లరసుతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో పొలంలో వ్యవసాయ పనులు చేసుకుందామని తీసుకొచ్చి ఈ ఘాతుకానికి పాల్పడినట్టు తేలింది. పరారీలో ఉన్న వల్లరసు కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## డీఎంకే కౌన్సిలర్ ఇంటిపై పెట్రోల్ బాంబు దాడి

అడయార్, ఫిబ్రవరి 3: నామక్కల్ జిల్లా ఎరుంబట్టి సమీపంలో డీఎంకేకు చెందిన వార్డు కౌన్సిలర్ ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ బాంబుతో శుక్రవారం రాత్రి దాడి చేశారు. ఎరుంబట్టి పంచాయతీ మూడో వార్డు కౌన్సిలర్‌గా శరవణన్. శుక్రవారం ఆయన తన ఇంట్లో నిద్రిస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ బాంబులు విసిరి పారిపోయారు. దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కోయంబేడులోని డీఎండీకే కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత


రామనాథపురం జిల్లా ముదుగళత్తూరులో మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం అధినేత టీటీవీ దినకరన్


కడలూరులో మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ద్రవిడ కళగం నేత కే వీరమణి

# హీరోగా నటించడం నచ్చింది

● అప్పుకుట్టి



సినిమాల్లో చిన్న చిన్న పాత్రలను పోషిస్తూ వచ్చిన తాను ఇపుడు కథలో హీరోగా నటించడం బాగా నచ్చిందని నటుడు అప్పుకుట్టి అన్నారు. 'వెన్నిలా కబడి కుళు' చిత్రం ద్వారా ఇండస్ట్రీలో ఒక్కసారిగా ఫేమస్ అయిన... అప్పుకుట్టి.. ఆ తర్వాత 'అళగర్‌స్వామియిన్ గుదిరై', 'వెందు తణిందదు కాడు' వంటి హిట్ చిత్రాల్లో నటించారు. ఇపుడు పాల్ డిపో కదిరేశన్ నిర్మాణంలో బెన్ని మోహన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'వాళ్గ వివసాయి' చిత్రంలో ఆయన ప్రధాన పాత్రను పోషించారు. ఈ చిత్రంలో కూడా తన పాత్రకు మళ్లీ జాతీయ అవార్డు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందులో అప్పుకుట్టి సరసన వసుంధర నటించారు. రాజుచంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పిరంద నాల్ వాళ్తుగల్' చిత్రంలో హీరోగా అప్పుకుట్టి నటించారు. కాగా, 'అళగర్‌సామియిన్ గుదిరై' చిత్రంలో జాతీయ అవార్డును సొంతం చేసుకున్న అప్పుకుట్టి... సూపర్‌స్టార్ రజనీకాంత్, 'దళపతి' విజయ్ చిత్రాల్లో హాస్యపాత్రలను పోషించాలని ఉందని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

# 25మంది సంఘ సేవకులకు హీరో కార్తీ సన్మానం

సమాజానికి వివిధ రూపాల్లో తమ వంతు సాయం చేస్తున్న సంఘసేవకుల్లో 25 మందిని ఎంపిక చేసి వారిని హీరో కార్తీ ఘనంగా సన్మానించారు. ఒక్కొరికి లక్ష రూపాయల నగదును అందజేశారు. కార్తీ హీరోగా 25 చిత్రాల్లో నటించారు. ఈ శుభతరుణంలో ఆయన పాతికమంది సంఘ సేవకులను సన్మానించారు. ఈ కార్యక్రమం శనివారం స్థానిక సాలిగ్రామంలోని ప్రసాద్ స్టూడియోలో జరిగింది. ఈ సందర్భంగా హీరో కార్తీ మాట్లాడుతూ... 'సినీ కెరీర్‌లో నేను ఈ స్థాయికి చేరుకునేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెప్పేందుకు వీలుగా కోటి రూపాయలతో ఏదో ఒకటి చేయాలని భావించా. తొలుత అన్నదానం చేశా. 25 పాఠశాలలకు కావాల్సిన సామాగ్రి అందించా. 25 వృద్ధాశ్రమాలను ఎంచుకుని సాయం చేశా. అయినప్పటికీ ఇంకా ఏదో చేయాలని ఆలోచిస్తుండగా, నా అభిమానులే సమాజంలో ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవ చేస్తున్న వారు ఎంతో మంది ఉన్నారని, వారికి సాయం చేద్దామని సలహా ఇచ్చారు. ఇందుకోసం ఒక జాబితాను తయారు చేయగా వందలాది మంది ఉన్నారు. వారిలో 25 మందిని ఎంపిక చేసి ఈ చిరు సత్కారం చేశాం. ఎంతో అమూల్యమైన తమ సమయాన్ని వెచ్చించి ఇక్కడకు వచ్చిన ఈ సంఘ సేవకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నా. వీరంతా తమ చుట్టూ ఉన్న మనుషులు కూడా బాగుండాలని ఆకాంక్షిస్తూ తమకు చేతనైన సాయం చేసే పెద్ద మనస్సున్న వారు. మున్ముందు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తా' అని పేర్కొన్నారు.



సన్మాన గ్రహీతలతో హీరో కార్తీ

## యువతరానికి సందేశమిచ్చే 'చిక్‌లెట్స్'

నేటి యువతరానికి సందేశమిచ్చేలా 'చిక్‌లెట్స్'ను తెరకెక్కించారు. ముత్తు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సాత్విక్‌వర్మ, నయన్ కరిష్మా, సురేఖా వాణి, శ్రీమన్, మనోబాలా, జాక్ రాబిన్‌సన్, అమృత హాల్డెర్, మంజీర, రాజగోపాల్ తదితరులు నటించగా, బాలమురళి బాలు సంగీతం అందించారు. ఈ చిత్ర కథను పరిశీలిస్తే, 'వివాహానికి వెళుతున్నా'మని తల్లిదండ్రులకు అబద్ధం చెప్పిన మూడు టీనేజ్ జంటలు... ఒక పార్టీకి వెళతాయి. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న వారి తల్లిదండ్రులు.. తమ పిల్లలు చెడు పనులు చేయకుండా అడ్డుకుంటారు. ఆ తర్వాత ఆ మూడు టీనేజ్ జంటల మధ్యం ఏం జరిగింది. తల్లిదండ్రుల మానసిక పరిస్థితి ఏంటి అనే అంశాలకు గ్లామర్ జోడించి చిత్రీకరించారు. ముఖ్యంగా 2కే కిడ్స్ మానసిక స్థితి, వారికి స్వేచ్ఛనివ్వడం కారణంగా జరిగే అనర్థాలు, వారి జీవన విధానం, వాటివల్ల ఏర్పడే సమస్యలు, తల్లిదండ్రుల సలహాలు వంటి అంశాలను కలర్‌ఫుల్‌గా చూపించారు. క్లైమాక్స్‌లో... నేటి యువతరానికి బాధ్యతలున్నాయి... తమ పిల్లలను తల్లిదండ్రులు నమ్మాలి... దండించాల్సిన సమయంలో అది కచ్చితంగా చేయాలి... అనే కథాంశాన్ని తెలియజెప్పేందుకు చేసిన ప్రయత్నంలో దర్శకుడు ముత్తు సఫలీకృతులయ్యారు.



'చిక్‌లెట్స్'లో ఓ దృశ్యం

## 'ఒరునొడి' ఫస్ట్‌లుక్ విడుదల

డెబ్యూ డైరెక్టర్ మణివర్మన్ దర్శకత్వంలో థమన్‌కుమార్ హీరోగా నటించిన 'ఒరునొడి' చిత్రం ఫస్ట్ లుక్‌ను ప్రముఖ దర్శకుడు జీవీ ప్రకాష్‌కుమార్ తాజాగా విడుదల చేశారు. ప్రముఖ నిర్మాత, 'టీఎఫ్‌టీపీ' వ్యవస్థాపకుడు ధనుంజన్ సమర్పణలో అళగర్ ప్రొడక్షన్, వైట్ ల్యాంప్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మించాయి. విభిన్నమైన కథాంశంతో రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో హీరో థమన్‌తో కలిసి ఎంఎస్ భాస్కర్, వేల రామ్మూర్తి, పళ కరుప్పయ్య, దీపా శంకర్, శివరంజని తదితరులు ఇతర పాత్రల్లో పోసించారు. కేజీ రతీష్ కెమెరామెన్‌గా పనిచేయగా, సంజయ్‌మాణిక్యం ఈ చిత్రం ద్వారా సంగీత దర్శకుడిగా పరిచయమవుతున్నారు. దర్శకుడు మణివర్మన్ మాట్లాడుతూ... ' మొదటి చిత్రంలోనే నా శైలిలో ముద్ర వేయాలన్న సంకల్పంతో ఔత్సాహిక నటీనటులతో కొత్త కోణంలో హర్రర్, మిస్టరీతో సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కించా. సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకుడు ఊహించని ట్విస్టులతో స్క్రీన్‌ప్లే సాగుతుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తయ్యింది. నిర్మాణాంతర కార్యక్రమాలను శరవేగంగా జరుపుకుంటున్నాం. త్వరలోనే విడుదల చేస్తాం' అని వివరించారు.



'ఒరునొడి' ఫస్ట్‌లుక్

### సంప్రదాయ క్రీడలను పునరుజ్జీవానికి

# ప్రభుత్వ పాఠశాల ప్రయత్నం



టైర్లు నడుపుతున్న విద్యార్థినులు - ఒంగుళ్లు... దూకుళ్ల ఆటలో విద్యార్థులు

పెరంబూర్, ఫిబ్రవరి 3: గత తరం ఎంతో ఇష్టపడే క్రీడలైన ఒంగుళ్లు..దూకుళ్లు, కోతికొమ్మచ్చి, బొంగరాలు, టైర్లు నడపడం, రాజా రాణి సహా పలు సంప్రదాయ క్రీడలు... సాంకేతిక అభివృద్ధి కారణంగా మెల్లగా అంతరించిపోతున్నాయి. ఈ క్రీడలను పునరుద్ధరించేందుకు ఎనిమిదేళ్లగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుత తరం క్రికెట్, టెన్నిస్, ఫుట్‌బాల్ లాంటి క్రీడలను విస్మరించి శారీరక శ్రమలేని 'ఆన్‌లైన్' ఆటల్లో మునిగితేలుతోంది. గతంలో సాయంత్రం వేళల్లో పరిగెత్తడం,ఆడుకోవడం వల్ల శారీరక శ్రమ ఉండేది. అందువల్ల పిల్లలు వ్యాధుల బారిన పడడం తక్కువగా ఉండేది.కానీ, నేటి ఆధునిక యుగంలో కంప్యూటర్ల అభివృద్ధి పిల్లలను నాలుగు గోడల మధ్య పరిమితం చేయడంతో వారి శారీరక ఆరోగ్యం క్షీణిస్తోంది. దీంతో విద్యార్థుల శరీరానికి బలం చేకూర్చే, మానసిక ఉల్లాసాన్ని కలిగించే సంప్రదాయ క్రీడలను మళ్లీ తీసుకురావాల్సిన ఆవశ్యకత పెరిగింది.

కోయంబత్తూర్ జిల్లా పొల్లాచ్చి సమీపం పెద్దనాయకనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యేటా సంప్రదాయ ఆటల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పాఠశాల 8వ సంప్రదాయ క్రీడల వారోత్సవాలు ఇటీవల జరిగాయి. డప్పు వాయిద్యాలు, కావడి ఆట్టం, వాయిలాట్టం, కళ్లగంతలు ఆట, టగ్ ఆఫ్ వార్, ఒంగుళ్లు..దూకుళ్లు, బొంగరాల ఆట సహా పలు ఆటల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ విషయమై పాఠశాల తమిళ ఉపాధ్యాయుడు బాలమురుగన్ మాట్లాడుతూ... ఏడేళ్లుగా తమ పాఠశాలలో సంప్రదాయ క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది పొంగల్ సందర్భంగా 8వ వార్షిక క్రీడలు నిర్వహించామన్నారు. సంప్రదాయ క్రీడల ద్వారా పిల్లల్లో ఊహ, ఆలోచన, జ్ఞాపక శక్తి మెరుగుపడతాయన్నారు. అలాగే, శారీరకంగా దృఢత్వం కలిగించడంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.



అన్నానగర్ పార్క్ మధ్యలోని చెరువు - టవర్‌కు వెళ్లే మార్గంలో ఆకట్టుకుంటున్న ఫౌంటైన్ - గోపురం చుట్టూ ఏర్పాటైన వాకింగ్ ట్రాక్

# అన్నానగర్ టవర్ పార్కులో పడవ సవారీ?

● ప్రజాభిప్రాయం మేరకు పరిశీలిస్తామన్న కమిషనర్

పెరంబూర్, ఫిబ్రవరి 3: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో ఉన్న ప్రాచీన పార్కుల్లో అన్నానగర్ డా.విశ్వేశరయ్య గోపురం (టవర్) పార్క్ ఒకటి. ఈ పార్క్‌ను గత 1968లో మాజీ రాష్ట్రపతి వీవీ గిరి ప్రారంభించారు. పార్కు ప్రాంగణంలో 135 అడుగుల టవర్ ఇప్పటివరకు నగరవాసులు ప్రముఖ పర్యాటక ప్రాంతంగా ఉంది. 2011 నుంచి ఈ గోపురంపైకి ఎక్కేందుకు నిషేధించారు. 12 ఏళ్లుగా కొనసాగిన నిషేధం, ప్రస్తుతం అదనపు భద్రతా చర్యలు చేపట్టి తొలగించింది. ఇక పార్కు మరమ్మతులకు జీసీసీ రూ.30 లక్షలు వెచ్చించింది.

**బోటింగ్‌పై పరిశీలన కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్**



అన్నానగర్ పార్క్‌లో బోటింగ్ ఏర్పాటుపై గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ జె.రాధాకృష్ణన్ మాట్లాడుతూ... పడవ సవారీ కావాలని ప్రజలు ఇష్టపడితే తప్పకుండా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ విషయమై ఆ ప్రాంత ప్రజల అభిప్రాయాలు స్వీకరించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, సంబంధిత శాఖల అధికారులు బోటింగ్ విషయంలో చేపట్టాల్సిన భద్రతా చర్యలు కూడా తీసుకోవడం ప్రధానమన్నారు. అన్ని జాగ్రత్త చర్యలు పాటించి త్వరలో బోటింగ్ సవారీ సాధ్యమేనని కమిషనర్ తెలిపారు.

**పర్యాటకులను ఆకర్షించేలా...**

పార్కుకు వచ్చే పర్యాటకులను ఆహ్వానం పలికేలా టవర్ గోపురం వరకు రంగురంగుల ఫౌంటైన్లు ఏర్పాటు చేశారు. అలాగే, చిన్నారులకు స్కేటింగ్ మైదానం, ఓపెన్ హాలు, ఓపెన్ ఎయిర్ ఆర్ట్ గ్యాలరీ, చిన్నారుల క్రీడా మైదానం, బాలికలకు ప్రత్యేక ఫిట్‌నెస్ సెంటర్, యోగా సెంటర్, వాకింగ్ ట్రాక్, సిట్టింగ్, రిలాక్సింగ్ సీట్లు, పెయింటింగ్స్, దట్టమైన మొక్కలు, చెట్లు తదితరాలు అందర్నీ ఆహ్లాదపరుస్తున్నాయి.

**మధ్యలో చెరువు...**

పిల్లల ఆట స్థలం పక్కనే ఉండే ఈ చెరువు పర్యాటకులను మరింతగా ఆకర్షిస్తోంది. ఈ ప్రాంతంలో భద్రతా చర్యలు కూడా ఏర్పాటయ్యాయి. చెరువు సమీపంలో నిలబడి వీక్షించడానికి ప్రహరీ కంచెలు, విశ్రాంతి తీసుకొనేలా బెంచీలు అమర్చారు. ఈ చెరువులో సుమారు 30 ఏళ్ల క్రితం బోటింగ్ ఉండేదని ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. పార్కు పునరుద్ధరణ తర్వాత ఈ చెరువును వీక్షిస్తున్న అనేక మంది సందర్శకులు, చెరువులో గతంలాగే బోటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## హీరో విశాల్ - లైకా ఖాతాల ఆడిట్

● హైకోర్టు ఆదేశం



నూతలపాటి శ్రీకృష్ణ

అడయార్, ఫిబ్రవరి 3: హీరో విశాల్, ప్రముఖ సినీ నిర్మాణ కంపెనీ లైకా ప్రొడక్షన్‌ల మధ్య జరిగిన బ్యాంకు లావాదేవీలను ప్రముఖ ఆడిటర్ నూతలపాటి శ్రీకృష్ణ ఆడిట్ చేయనున్నారు. మద్రాసు హైకోర్టు ఆదేశం మేరకు శ్రీకృష్ణ తనిఖీ చేసి కోర్టుకు నివేదికను సమర్పించనున్నారు. ప్రముఖ సినీ ఫైనాన్షియర్, సినీ నిర్మాత, గోపురం ఫిలిమ్స్ అధినేత అన్బుచెళియన్ వద్ద సినీ నిర్మాణం కోసం హీరో విశాల్ (విశాల్‌కృష్ణ) రూ.21.29 కోట్ల రుణం తీసుకున్నారు. ఆ తర్వాత జరిగిన ఒప్పందం మేరకు ఈ మొత్తాన్ని అన్బుచెళియన్‌కు లైకా ప్రొడక్షన్స్ చెల్లించగా, ఈ మొత్తాన్ని 30 శాతం వార్షిక వడ్డీతో హీరో విశాల్ లైకాకు చెల్లించాల్సి ఉంది. కానీ, రుణాన్ని విశాల్ చెల్లించడంలో విఫలమయ్యారు. దీంతో లైకా ప్రొడక్షన్స్ హైకోర్టును ఆశ్రయించడంతో గత కొన్ని నెలలుగా ఈ కేసు విచారణ జరుగుతోంది. విశాల్ రూ.15 కోట్లు డిపాజిట్ చేయాలని కోర్టు గతంలో ఆదేశించగా, ఆ మేరకు డిపాజిట్ చేసేందుకు తన వద్ద వనరులు లేవని పేర్కొంటూ తన బ్యాంకు ఖాతాల వివరాలను విశాల్ తరఫు న్యాయవాది కోర్టుకు అందజేశారు. అదే సమయంలో లైకా ప్రొడక్షన్స్ బ్యాంకు ఖాతాల తనిఖీ కోసం ఆడిటర్‌ను నియమించాలని కోరారు. దీంతో విశాల్, లైకా ప్రొడక్షన్స్ మధ్య బ్యాంకు ఖాతాల లావాదేవీలను ఆడిట్ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ ఇందుకోసం ఆడిటర్ శ్రీకృష్ణను నియమిస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ పీటీ ఆషా ఉత్తర్వులు జారీ చేశారు. పైగా, మూడేళ్లకు సంబంధించిన ఆదాయ పన్ను రిటర్న్స్, బ్యాంకు స్టేట్మెంట్‌లను ఆడిటర్‌కు అందజేయాలని న్యాయమూర్తి ఆదేశించారు.

## పుదుచ్చేరిలో పోటీ చేసేది బీజేపీయే

● లోక్‌సభ ఎన్నికలపై రంగస్వామి స్పష్టం

పుదుచ్చేరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో ఉన్న ఏకైక పార్లమెంటు నియోజకవర్గం నుంచి బీజేపీ పోటీ చేస్తుందని ఎన్నార్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి ప్రకటించారు. ప్రస్తుతం పుదుచ్చేరీలో ఎన్నార్ కాంగ్రెస్-బీజేపీ కూటమి అధికారంలో ఉంది. అధికారంలో ఎన్నార్ కాంగ్రెస్‌తో పాటు బీజేపీ నేతలు కూడా మంత్రులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో, పుదుచ్చేరి పార్లమెంటు స్థానంలో పోటీ చేయడంపై ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి నిర్మల్‌కుమార్ శనివారం సమావేశమై చర్చించారు. అందులో భాగంగా పుదుచ్చేరి సీటు బీజేపీకి అప్పగించినట్లు, సరైన అభ్యర్థిని ఆ పార్టీ ఎంపిక చేస్తుందని ఆశిస్తున్నట్లు ముఖ్యమంత్రి రంగస్వామి ప్రకటించారు. కాగా, ఈ స్థానం నుంచి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ పోటీ చేసే అవకాశముందనే ఆ పార్టీ వర్గాల సమాచారం. కాగా, శనివారం ఈ సీటును బీజేపీకి కేటాయిస్తున్నట్లు ఎన్నార్ కాంగ్రెస్ ప్రకటించిన నేపథ్యంలో, ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ మర్యాదపూర్వకంగా కలుసుకోవడం చర్చనీయాంశమైంది.

## అన్నామలై పాదయాత్రలో 25 మొబైల్ ఫోన్లు చోరీ

అడయార్, ఫిబ్రవరి 3: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై చేస్తున్న పాదయాత్రలో మొబైల్ ఫోన్లు విపరీతంగా చోరీకి గురవుతున్నాయి. ఇప్పటివరకు ఏకంగా 25 సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్టు ఫిర్యాదులు రావడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ప్రస్తుతం అన్నామలై పాదయాత్ర వేలూరు జిల్లాలో కొనసాగుతోంది. ఆయన్ను శుక్రవారం పుదియనీతి కట్చితో పాటు పలు పార్టీలకు చెందిన నేతలు కలుసుకుని తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తీవ్ర రద్దీ నెలకొంది. ఇదే అదునుగా భావించిన జేబు దొంగలు తమ చేతివాటం ప్రదర్శించి సెలఫోన్లను తస్కరించారు. ఇలా ఏకంగా 25 మొబైల్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు గుడియాత్తం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

## వరుణదేవుడి కరుణ కోసం... వాగులో మూకుమ్మడిగా చేపలవేట

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా సింగంపునరి సమీపం పట్టికరైపట్టిలోని పెద్ద వాగులో వరుణదేవుడి కరుణ కోసం గ్రామస్తులు చేపలవేట సాగించారు. పట్టికరైపట్టిలో సుమారు 300 ఎకరాల విస్తీర్ణం కలిగిన పెద్ద వాగు ఉంది. ఆ వాగు జలాల ద్వారా సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతోంది. మూడేళ్లుగా వర్షాలు కురవడంతో ఆ వాగు జలాలతో పంటలు విరివిగా పండించారు. ఈ నేపథ్యంలో గత నెల రోజులుగా ఆ ప్రాంతంలో వర్షం కురవకపోవటంతో వాగులో నీటి మట్టం క్రమంగా తగ్గసాగింది. ఈ నేపథ్యంలో ఊరి పెద్దలంతా సమావేశమై వరుణదేవుడు అనుగ్రహించాలని, వర్షాలు భారీగా కురిసి మళ్లీ పంటలు పండాలని కోరుతూ ఆ వాగులో చేపలవేట సాగించాలని నిర్ణయించారు. ఆ మేరకు ఆ గ్రామంలోనే కాకుండా చుట్టుపక్కల పట్టికరైపట్టి వాగులో చేపలవేట జరుగుతుందని దండోరా వేయించారు. శుక్రవారం ఉదయం ఆ వాగు వద్దకు ప్రాణమలై, కుమరత్తకుడిపట్టి, వయ్యాపురిపట్టి, సొల్లియంపట్టి, వేంగైపట్టి, కల్లాపూరు, సింగంపునరి, మరుదిపట్టి గ్రామాల నుంచి మదురై, దిండుగల్, పుదుకోట తదితర పొరుగు జిల్లాల నుంచి ప్రజలు వేలసంఖ్యలో గుమికూడారు. వీరిలో చాలా మంది చేపలుపట్టేందుకు జాలర్లు ఉపయోగించే కొక్కీ వలలు, దోమతెరలు, వెదురుబుట్టలు, తువ్వాలు, ధోవతులు చేతపట్టుకుని నిలిచారు. ఊరి పెద్దలు చేపలవేట ప్రారంభించేలా బాణసంచా పేల్చగా మూకుమ్మడిగా ఆ జనమంతా పాటలు పాడుతూ, ఈలలు వేస్తూ చేపలు పట్టారు. ఒక్కసారిగా ప్రజలు వాగులో దిగటంతో చేపలన్నీ పైకెగర సాగాయి. అదే అదునుగా పలువురు వాటిని చేతులతో పట్టుకునేందుకు ప్రయత్నించారు. జిలేబీ, కడలా, శంకరా, కొండై, మచ్చైకొళుత్తి రకాలకు చెందిన చిన్న సైజు నుంచి పెద్ద సైజు వరకు చేపలను పట్టారు. సుమారు రెండు గంటలకుపైగా సాగిన ఈ వేటలో చాలా మందికి చేపలు చిక్కాయి. తాము పట్టుకున్న పెద్ద చేపలను చూపుతూ కేకలు పెట్టి సందడి చేశారు.



వాగులో తమకు లభించిన చేపలతో గ్రామస్తులు

## తుదిశ్వాస వరకు సేవలందించిన ధర్మనిరతుడు

● వై.రామకృష్ణకు 'సమితి' ఘన నివాళి

అడయార్, ఫిబ్రవరి 3: తండ్రికి ఇచ్చిన మాటకు కట్టుబడి తన చివరి తుదిశ్వాస వరకు తెలుగు భాషకు, తెలుగు ప్రజలకు సేవలందించిన ధర్మనిరతుడు యర్రమిల్లి రామకృష్ణ అని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి అధ్యక్షుడు అజంత కె.శంకర్ రావు అన్నారు. ఈ సమితి ఆధ్వర్యంలో ఇటీవల భౌతికంగా దూరమైన వై.రామకృష్ణకు సంతాప సభ నగరంలో జరిగింది. ఈ సందర్భంగా సమితి సభ్యులు తమకు రామకృష్ణతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అజంతా కె.శంకర రావు మాట్లాడుతూ... తన తండ్రి వైఎస్ శాస్త్రి మరణానంతరం ఆయన కోరిక మేరకు దక్షిణాఫ్రికా నుంచి స్వదేశానికి తిరిగివచ్చి పొట్టి శ్రీరాములు మెమోరియల్ సొసైటీ, స్మారక భవనం బాధ్యతలు స్వీకరించారన్నారు. ఈ బాధ్యతలను స్వీకరించడం ఏమాత్రం ఇష్టంలేని రామకృష్ణ... తండ్రికి ఇచ్చిన మాటకు కట్టుబడి తన చివరి ఊపిరి వరకు సేవలు అందించిన ధర్మనిరతుడు మన కలియుగ రాముడు అన్నారు. తెలుగు భాష, సంస్కృతుల పరిరక్షణకు, అమరజీవి పొట్టి శ్రీరాములు సేవకోసం, తండ్రిని మించిన సేవలు చేశారనడంలో అతిశయోక్తి లేదన్నారు. 2020లో వచ్చిన కరోనా మహమ్మారితో వ్యక్తిగత అనారోగ్యం కారణంగా ప్రత్యక్ష కార్యక్రమాలు చేయలేకపోయినా... మిత్రులు, కార్యవర్గ సహకారాలు, సాంకేతిక సాయంతో అంతర్జాతీయ స్థాయికి సమితి కార్యక్రమాలను తీసుకెళ్లారని గుర్తు చేశారు. ఆయన లేని లోటు ఒక్క సమితికి మాత్రమే కాకుండా, చెన్నై తెలుగు ప్రజలకు తీరని లోటని సమితి ఉపాధ్యక్షుడు డాక్టర్ దిట్టకవి అనంత పద్మనాభమూర్తి అన్నారు. అలాగే, జయశ్రీ పద్మావతి, డాక్టర్ కల్పనా గుప్తా, శివ సుబ్రహ్మణ్యం, గుర్రం బాలాజీ తదితరులు రామకృష్ణతో తమకున్న అనుబంధాన్ని వివరించారు. ఎంతో సౌమ్యంగా, ప్రేమతో చిరునవ్వుతో పలకరించే ఆ ముఖారవిందం ముడుచుకున్న వేళ సమితి సభ్యులు పుష్పాలతో నివాళి అర్పించి, బరువెక్కిన హృదయంతో రామకృష్ణ సేవలను గుర్తు చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఈనెల 6న సాయంత్రం 5 గంటలకు బాలానందం పాఠశాలలో కూడా సంస్మరణ నిర్వహించనున్నట్టు సమితి పేర్కొంది. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని తెలిపింది.



రామకృష్ణకు నివాళి అర్పిస్తున్న ప్రముఖులు



యోగా శిక్షణలో అధికారులు, పోలీసులు

### మానసిక ఒత్తిడి అధిగమించేలా

# పోలీసులకు యోగా శిక్షణ

పెరంబూర్, ఫిబ్రవరి 3: మానసిక ఒత్తిడి అధిగమించేలా అధికారులు, పోలీసులకు యోగా శిక్షణ అందించారు. గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ఉత్తర్వులతో, స్థానిక ఎగ్మూర్‌లోని రాజరత్తినం స్టేడియంలో శనివారం సెంట్రల్ క్రైం బ్రాంచ్ అధికారులు, పోలీసులకు యోగా శిక్షణ అందించారు. ఇద్దరు డిప్యూటీ కమిషనర్లు, ఇద్దరు అడిషనల్ డిప్యూటీ కమిషనర్లు, నలుగురు అసిస్టెంట్ కమిషనర్లు, 10 మంది ఇన్‌స్పెక్టర్లు, 226 మంది పోలీసులు అని మొత్తం 244 మంది శిక్షణకు హాజరయ్యారు. యోగా మాస్టర్ విక్రమ్ శ్రీనివాసన్, సూర్య నమస్కారం, బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్ సహా అంశాలపై శిక్షణ ఇచ్చారు.

## ఘనంగా మనోన్మణియం విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

● 432 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేసిన గవర్నర్

ప్యారీస్, ఫిబ్రవరి 3: తిరునెల్వేలిలోని మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయ 30వ స్నాతకోత్సవం శనివారం ఉదయం ఘనంగా జరిగింది. రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ముఖ్యఅతిథిగా పాల్గొని, 432 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేసి అభినందించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి చంద్రశేఖర్, రిజిస్ట్రార్ సోక్రటీస్, ముఖ్యఅతిథిగా రాజస్థాన్ టెక్నాలజీ వర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ నలిన వ్యాస్ తదితరులు పాల్గొన్నారు. చెన్నై నుంచి నెల్లైకి చేరుకున్న గవర్నర్‌కు ప్రభుత్వ అధికారులు, వర్శిటీ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎన్‌సీసీ కేడెట్ల గౌరవ వందనాన్ని గవర్నర్ స్వీకరించారు. ఈ వేడుకల్లో మొత్తం 40,622 మంది విద్యార్థినీ, విద్యార్థులు పట్టాలు పొందగా రీసెర్చి విభాగంలో 351 మంది గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్నారు.




విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి






## ప్రతి నెలా మా సంస్థ నుంచి ఒక సినిమా

**టీజీ విశ్వప్రసాద్**



**రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందిన 'ఈగల్' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ సినిమా విశేషాలను మీడియాకు వెల్లడించారు.**

● మేం నిర్మించిన 'ధమాకా' మాస్ ఎంటర్‌టైనర్ అయితే, 'ఈగల్' స్టయిలిష్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్. కంటెంట్ అద్భుతంగా ఉంటుంది. ఆడియన్స్‌ను అలరించే అంశాలు ఎన్నో ఉన్నాయి. రవితేజ చాలా కొత్తగా కనిపిస్తారు.

● ఈ సినిమాను జనవరిలో విడుదల చేయాలనుకున్నాం. కానీ పరిశ్రమ మేలుని దృష్టిలో పెట్టుకుని ఫిబ్రవరికి వెళ్లాం. ట్రేడ్ విషయానికి వస్తే అప్పుడు మేం సెకండ్ బెస్ట్. ఇప్పుడు నంబర్ వన్. మిగతా చిత్రాలు రీచ్ దేనికదే. ఈ ఏడాది మా సంస్థ నుంచి కనీసం 15 సినిమాలు విడుదలవుతాయి. అవి పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్నాయి. ప్రొడక్షన్‌లో దాదాపు 6 చిత్రాలు ఉన్నాయి. అలాగే దాదాపు నాలుగు సినిమాలు అమెరికాలో చేస్తున్నాం. ప్రతి నెలా మా సంస్థ నుంచి ఒక చిత్రం విడుదల కానుంది. ఈ ఏడాది 50 చిత్రాల మైలు రాయిని అందుకుంటామని భావిస్తున్నాం.

## మంచి కంటెంట్‌తో...



చైతన్యా రావు, భూమి షెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి దర్శకత్వంలో నాగార్జున సామల, శ్రీష్ కుమార్, డాక్టర్ కృష్ణకాంత్ చిత్రజల్లు నిర్మించిన ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా టీజర్‌ను శనివారం జరిగిన కార్యక్రమంలో దిల్ రాజు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'ఒక మంచి కాన్సెప్ట్ తీసుకుని 'షరతులు వర్తిస్తాయి' చిత్రాన్ని నిర్మించారు. సాంగ్, టీజర్ చూశాను. బాగున్నాయి. ఇదొక మంచి సినిమా అవుతుందని ఆశిస్తున్నా' అన్నారు. దర్శకుడు కుమారస్వామి మాట్లాడుతూ 'ప్రేక్షకులకు చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా ఉండదు. మంచి కంటెంట్ ఉంటే తప్పకుండా చూస్తారు. మా సినిమాలో అది ఉంది. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని నమ్ముతున్నాం' అన్నారు. 'నేను కరీంనగర్ వాసిని. పరిశ్రమలో నటుడిగా ఎదిగి మళ్లీ కరీంనగర్ వెళ్లి షూటింగ్ చేయడం ఓ అచీవ్‌మెంట్‌గా ఉంది' అన్నారు చైతన్యారావు.

## ప్రేక్షకులకు ముఖ్య గమనిక



విరాన్ ముత్తంశెట్టి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ముఖ్య గమనిక'. సినిమాటోగ్రాఫర్ వేణు మురళీధర్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. లావణ్య కథానాయిక. ఈ చిత్రం ట్రైలర్‌ను నిర్మాత బన్నీవాసు విడుదల చేసి సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'హీరో పాత్రలో విరాన్ అద్భుతంగా నటించాడు. పాటలకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది' అన్నారు. నిర్మాతలు రాజశేఖర్, సాయికృష్ణ మాట్లాడుతూ 'వేణు అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. కిరణ్ నేపథ్య సంగీతం ఆకట్టుకుంటుంది' అని చెప్పారు.

## హనుమాన్ బాటలో ఆదిపర్వం



మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఆదిపర్వం'. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో ఎంఎస్‌కే నిర్మిస్తున్నారు. 1970 నేపథ్యంలో సాగే పీరియాడిక్ డ్రామా ఇది. "అమ్మోరు, అరుంధతి' చిత్రాల తరహాలోనే ఆదిపర్వం లోనూ గ్రాఫిక్స్ హైలెట్‌గా నిలుస్తాయని, 'హనుమాన్' చిత్రం లానే 'ఆదిపర్వం' కూడా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంద'ని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రంలో నాగులాపురం నాగమ్మ పాత్రలో మంచు లక్ష్మి నట విశ్వరూపం చూడొచ్చని నిర్మాత చెప్పారు.

## ఆపరేషన్ తేదీ మళ్లీ మారింది



వరుణ్ తేజ్ నటించిన తొలి హిందీ చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్' విడుదల తేదీ మళ్లీ మారింది. వైమానిక దళ వీరుల అలుపెరుగని పోరాటాన్నీ, దేశాన్ని రక్షించడంలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను అద్భుతంగా ఆవిష్కరించే ఈ చిత్రాన్ని మొదట గత ఏడాది డిసెంబర్ 8న విడుదల చేయాలనుకున్నారు. అ తర్వాత వాయిదా వేశారు. మళ్లీ ఫిబ్రవరి 16న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ డేట్ కూడా మారింది. మార్చి ఒకటిన ఈ చిత్రం విడుదల కానుందని తాజాగా వెల్లడించారు. తెలుగు, హిందీ భాషల్లో రూపుదిద్దుకొన్న ఈ చిత్రంలో మానుషి చిల్లర్ రాడార్ ఆఫీసర్‌గా నటించారు. శక్తి ప్రతాప్ సింగ్ హుడా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్ రినైసన్స్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

## లక్కీ భాస్కర్ కథ ఏమిటి?



తెలుగులోనూ అభిమానుల్ని సంపాదించుకొన్న మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్. తన తాజా చిత్రం 'లక్కీ భాస్కర్' కోసం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. వెంకీ అట్లూరి ఈ చిత్రానికి దర్శకుడు. దుల్కర్ తన పన్నెండేళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా 'లక్కీ భాస్కర్' చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. మగధ బ్యాంకులో క్యాషియర్‌గా పని చేస్తున్న లుక్‌లో దుల్కర్ కనిపించారు. 80ల కాలం నాటి బొంబాయి నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ప్రేక్షకుల అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా అద్భుతమైన చిత్రాన్ని అందించడం కోసం దర్శకనిర్మాతలు కృషి చేస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు, మలయాళ, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేయడానికి నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్లాన్ చేస్తున్నారు.

## హనీమూన్ ప్రేమగీతం



చైతన్యరావు, హెబ్బాపటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. తనికెళ్ల భరణి, సుహాసినీ కీలకపాత్రలు పోషించారు. బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. సంగీత దర్శకుడు కల్యాణి మాలిక్ స్వరపరచిన హృద్యమైన ప్రేమగీతాన్ని శనివారం రచయిత విజయేంద్రప్రసాద్ చేతుల మీదుగా విడుదల చేసింది. ఈ గీతాన్ని అనురాగ్ కులకర్ణి ఆలపించారు.

## దిక్సూచి DIKSUCHI

## ఎన్‌ఐఎస్‌ఎంలో పీజీ ప్రోగ్రామ్



ముంబైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్(ఎన్‌ఐఎస్‌ఎం)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ సెక్యూరిటీస్ మార్కెట్స్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది వీకెండ్ ప్రోగ్రామ్. దీని వ్యవధి 15 నెలలు. ఈ ప్రోగ్రామ్‌లో పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ, రీసెర్చ్ అనాలిసిస్ అనే మూడు స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ అనువుగా ఉంటుంది.

**అర్హత-ఎంపిక:** ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు దరఖాస్తుకు జతచేయాలి. ఇంగ్లీష్‌లో వెర్బల్, రిటెన్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు. అకడమిక్ ప్రతిభ, ఆన్‌లైన్ పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 28
- **వెబ్‌సైట్:** www.nism.ac.in

## ఐఐటీ గాంధీనగర్‌లో పీహెచ్‌డీ

గాంధీనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**విభాగాలు:** బయలాజికల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కాగ్నిటివ్ అండ్ బ్రెయిన్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎర్త్ సైన్సెస్-ఎర్త్ సిస్టమ్స్ సైన్స్ అండ్ ఆర్కియలాజికల్ సైన్సెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్-సొసైటీ అండ్ కల్చర్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ/ఎమ్మెస్సీ/బీటెక్/ఎంటెక్/బీఎస్(ఐసర్/ఐఐఎస్సీ)/బీఎస్-ఎంఎస్(ఐసర్)ఉత్తీర్ణులై ఉండాలి. నెట్/గేట్ అర్హత ఉన్నవారికి; సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులకు; ఐఐటీలు, ఐసర్లు, ఐఐఎస్సీ నుంచి 8 సీజీపీఏతో పీజీ/ఎంఎస్ పూర్తిచేసినవారికి సంస్థ ఫెలోషిప్ ఇస్తుంది.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20
- **వెబ్‌సైట్:** iitgn.ac.in

## అప్లయిడ్ స్టాటిస్టిక్స్‌లో పీజీ డిప్లొమా

కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐఎస్‌ఐ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ అప్లయిడ్ స్టాటిస్టిక్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల ఆన్‌లైన్ ప్రోగ్రామ్. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. హైస్కూల్ స్థాయి మేథమెటిక్స్‌లో ప్రావీణ్యం ఉండాలి. అకడమిక్ మెరిట్, అసెస్‌మెంట్ టెస్ట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

**ప్రోగ్రామ్ వివరాలు**

- మొదటి సెమిస్టర్‌లో బేసిక్ స్టాటిస్టిక్స్, బేసిక్ ప్రాబబిలిటీ, స్టాటిస్టికల్ మెథడ్స్, సర్వే శాంపిలింగ్, ఇంట్రడక్షన్ టు అఫీషియల్ స్టాటిస్టికల్ సిస్టమ్, స్టాటిస్టిక్స్ అండ్ ఎకానమీ కోర్సులు ఉంటాయి.
- రెండో సెమిస్టర్‌లో అఫీషియల్ స్టాటిస్టిక్స్, డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవాలి.
- ప్రోగ్రామ్‌లో భాగంగా లెక్చర్లు, క్విజ్‌లు, అసైన్‌మెంట్లు, ఇంటరాక్షన్ సెషన్స్, కెరీర్ వర్క్‌షాప్‌లు, మెంటార్‌షిప్ సెషన్స్ ఉంటాయి.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 18
- **అసెస్‌మెంట్ టెస్ట్ తేదీ:** ఫిబ్రవరి 25
- **వెబ్‌సైట్:** www.isical.ac.in

## నిమ్‌హాన్స్‌లో సర్టిఫికెట్ కోర్సు



బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్(నిమ్‌హాన్స్)- 'బేసిక్స్ ఆఫ్ యోగ థెరపీ ఫర్ మెంటల్ హెల్త్ ప్రొఫెషనల్స్' కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది సర్టిఫికెట్ కోర్సు. ఇందులో 100 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. కోర్సు వ్యవధి ఒక నెల. రోజుకి రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు ఆన్‌లైన్ ట్రెయినింగ్ ఉంటుంది. సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజూ సాయంత్రం నాలుగుంబావు నుంచి ఆరుంబావు వరకు ట్రెయినింగ్ సెషన్స్ నిర్వహిస్తారు. కోర్సు చివరలో ఒక రోజు ఆఫ్‌లైన్ వర్క్‌షాప్ నిర్వహిస్తారు.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎంబీబీఎస్/బీఏఎంఎస్/బీహెచ్‌ఎంఎస్/బీఎన్‌వైఎస్/బీయూఎంఎస్/బీఎస్ఎంఎస్ ఉత్తీర్ణతతోపాటు మెంటల్ హెల్త్ క్లినికల్ సర్వీసెస్ విభాగాల్లో పని చేస్తున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. (పీహెచ్‌డీ/ఎమ్మెస్సీ/ఎంఫిల్)(సైకియాట్రీ/క్లినికల్ సైకాలజీ/సైకియాట్రిక్ సోషల్ వర్క్/సోషల్ వర్క్/సైకియాట్రిక్ నర్సింగ్) ఉత్తీర్ణులు; కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు సహా ఆర్మ్‌డ్ ఫోర్సెస్, ఎన్‌జీఓ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 24
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** మార్చి 1 నుంచి
- **ఈ-మెయిల్:** yogaforstress.nimhans@gmail.com
- **వెబ్‌సైట్:** nimhans.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/GUALukCలో చదవండి.